

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# రెండో కృష్ణుడు

.

గోవర్ధన్ నటుడు. అతను కేవలం రంగ స్థల నటుడు మాత్రమే కాదు. మొహానికి రంగు వేసుకున్నప్పుడూ, వేసుకోనప్పుడూ కూడా అతను నటుడే. అతనికి చేతనైన విద్య పద్యాలు పాడటం, నాటకాలు వేయటం, అరగంట సేపు గుక్క పట్టి రాగం తీసే ప్రతిభ చూసి అతనికి రెండో కృష్ణు డనే పేరు వచ్చేసింది. అతను ఆ వేషంలో ఉండగా చూసిన కేదారేశ్వరి బొక్కబోర్లా ప్రేమలో పడి పోయింది. ఆ మైకంలో ఉండగానే అందరి ముందూ తలొంచుకొని అతని చేత తాళి కట్టించుకుంది. అందుకు ఇప్పుడు అందరి ముందూ తలెత్తుకుని తిరగ లేక పోతోంది.

పెళ్ళి అయిన ఆరు నెలలకే గోవర్ధన్ రంగు వెలిసిన బొమ్మలా కనిపించాడు. ఎంచక్కా ఏదన్నా ఉద్యోగం చేస్తూ, నెలనెలా జీతం డబ్బులు తన చేతిలో పోస్తూ, తీరిక ఉన్నప్పుడు నాటకాలు వేస్తూ ఉంటే, ఏదో టైం పాస్ కోసం నాటకాలు వేస్తూ గొప్ప వాడని అందరి చేతా పొగిడించు కుంటూ ఉంటే అనంద పడాలనుకుంది. కాని ఆమె ఊహలన్నీ తల్లకిందులైనయి.

అతనికి ఉద్యోగం సద్యోగం ఏమీ లేదు. తెల్లారి లేచినప్పటి నుంచీ ఎవడు కనిపిస్తే వాడితొ హస్క్ కొడుతూ కూర్చుంటాడు. అందరూ అతన్ని చులకనగా చూస్తున్నారని తెలుసు. అందుకని తన గురించి తనే గొప్పలు చెప్పుకుంటూ ఉంటాడు. ఫలానా నటుడు, ఫలానా రాజకీయ నాయకుడు. ఫలానా ఆఫీసర్ నాకు తెలుసు. నేను ఎంత చెబితే అంతే అంటూ కోతలు కోసేస్తూ ఉంటాడు. దానితో అతని సహాయం కోరే వాళ్ళు కొంత మంది పోగయ్యారు. రేషన్ కార్డ్, పాస్ పోర్ట్, కాలేజ్ లో సీటు, ఉద్యోగం, ఏది కావాలంటే అది ఇప్పిస్తానంటూ కబుర్లు చెప్పేస్తుంటే, అందరూ కాక పోయినా కొంతమంది అయినా అతని దగ్గరికి రావటం మొదలు పెట్టారు. ఈ అవకాశాన్ని అతను బాగా వినియోగించు కోవటం అలవాటు చేసుకున్నాడు. వాళ్ళకి పార్టీలు, బహుమతులూ ఇవ్వాలంటూ వీళ్ళ దగ్గర డబ్బు గుంజటం మొదలు పెట్టాడు. ఎన్నాళ్ళకీ పని కాక పోవటంతో వాళ్ళు డబ్బు వాపసు ఇవ్వమని నిలదీయ సాగారు. దీనితో ఉన్న పరువు కూడా పోతున్నదని కేదారేశ్వరి బాధ పడుతున్నది.

తనకు తెలిసిన దూరపు బంధువు ను పట్టుకుని ఒక ఆఫీసులో అటెండరు ఉద్యోగం ఇప్పించింది. నెల రోజులు తిరగ కుండానే ఏవో వంకలు పెట్టి ఆ ఉద్యోగం మానేశాడు.

ఇదిలా ఉండగా వాళ్ళ ఇంటికి దగ్గరలో ఒకామె అద్దెకు దిగింది. ఎవరో చెప్పారని రేషన్ కార్డ్ కోసం గోవర్ధన్ ని వెతుక్కుంటూ వచ్చింది. ఆమె పేరు అహల్య. భర్త లేడు ఒక్కతే ఉంటోంది.

ఆమెను ఆదుకోవాలన్న అలోచన గోవర్ధన్ కి వచ్చింది. ఆ సాయంత్రం ఆమె ఇంటికి వెళ్ళాడు. పెద్దగా సామాను ఏమీ లేదు. దేవుడు ఇచ్చిన అందం తప్ప ఆమె సంపాదించుకున్న ఆభరణాలేమీ లేవు.

"కష్టాల్లో ఉన్నాను. ఆదుకునే వారు ఎవరూ లేరు. ఒంటరి దాన్ని." అన్నది అహల్య.

" బాధ పడకండి. నేనూ కష్టాల్లో పుట్టి పెరిగిన వాడినే. నా దగ్గర ఎలాంటి సందేహం పెట్టుకోవద్దు. ఇవాల్టి నుంచి మీకు నేను ఉన్నాను. ఏ చిన్న సాయం కావలసినా నాకు చెప్పండి. చేతనైనంత వరకూ చేస్తాను. మనిషిని మనిషి ఆదుకోక పోతే ఎందుకీ బ్రతుకు ?" అన్నాడు.

ఆమె దగ్గర డబ్బు లేదు. రోజు గడిచే మార్గం లేదు. ఆదుకునే దిక్కు లేదు. అందువల్ల గోవర్ధన్ కొండంత అండగా కనిపించాడు. నదిలో కొట్టుకు పోతున్న మనిషికి పెద్ద మానో మాకో దొరికినట్లు అయింది.

గోవర్ధన్ ఆమె దగ్గర తన గొప్పలు చెప్పు కోవటం మొదలు పెట్టాడు. అవన్నీ నిజమే నని నమ్మి తన గత చరిత్ర అతనికి చెప్పుకుంది.

ఆమె ఒక ప్రముఖ రాజకీయ నాయకుడిని నమ్ముకుని కొన్నాళ్ళు అయనతో ఉండి పోయింది. మోజు తీరిన తరువాత ఆమె ముఖం చూడటం మానేశాడు.. ఈమె గొడవ చేయ బోతే చంపేస్తానని బెదిరించాడు. ఆ భయం తో ఎవరికీ ఆచూకీ దొరక కుండా గుట్టుగా ఇక్కడ బ్రతుకుతున్నది.

"నీకేం ఫర్వాలేదు. నాకు మంత్రులు తెలుసు. పోలీసు ఆఫీసర్లు తెలుసు. వాడొచ్చి నీ కాళ్ళ మీద పడే టట్లు చేస్తాను..." అని ఆమెను మభ్య పెట్టాడు.

ఆమెకు రక్షణ కల్పించటం కోసం రోజుకు మూడు సార్లు ఆమె ఇంటికి వచ్చి వెళ్తున్నాడు. వీళ్ళ వ్యవహారం నలుగురి కంటా పడుతూనే ఉంది. గోవర్ధన్ కూడా కావాలనే అలాంటి అభిప్రాయమే కలిగించాడు.

"ఆమె నా మనిషి. ఆమె మంచి చెడులన్నీ నావే..." అంటూ అందరి తో చెప్పటం మొదలు పెట్టాడు..

ఇదంతా కేదారేశ్వరికి తెలిసింది. "ఏమిటి ఈ గోల ?" అని అడిగింది.

"గొప్ప పేరున్న నాయకుడు దాన్ని కొన్నాళు వాడుకుని వదిలేసాడు. దీన్ని అడ్డం పెట్టుకుని వాడిని బ్లాక్ మెయిల్ చేస్తాను. చచ్చినట్టు డబ్బు ఇస్తాడు. మన కష్టాలు తీరుతయి " అని భార్యకు చెప్పాడు.

భర్త చెప్పే మాటల్లో ఎంత నిజం ఉందో కూడా తెలియదు. అయినా ఆమె చెప్పినా ఆగే స్థితి లో లేదు. చేసేదేమీ లేక ఊరుకుంది.

అహల్య తన భార్య అని అతను అందరి తో చెప్పుకుంటున్నా, ఆమె మాత్రం ఒకసారి మోసపోయినందు వల్ల గోవర్ధన్ ను ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచుతున్నది.

ఆమె ద్వారా డబ్బు సంపాదించు కోవాలన్న దురాశ ఎక్కువ అయింది. ఆయనకు ఫోన్లు చేసి బెదిరించటం మొదలు పెట్టాడు. మొదట్లో ఆ నాయకుడు పెద్దగా పట్టించు కోలేదు. కాని ఈ విషయం లో బెదిరింపులు ఎక్కవ చేసి ఆయన కు నిద్ర లేకుండా చేసాడు గోవర్ధన్.

ఒక రోజు తెల్లవారే టప్పటికి రేకుల షెడ్డులో అహల్య శవం రక్తం మడుగు లో పడి ఉంది. పోలీసులు వచ్చారు. ఇరుగు పొరుగును విచారించారు. వాళ్ళంతా గోవర్ధన్ ఆమెకు మొగుడు కాని మొగుడు అని వాళ్ళ మధ్య అక్రమ సంబంధం ఉందని అందరూ చెప్పారు.

గోవర్ధన్ ను అరెస్ట్ చేసి తీసుకెళ్ళారు.

అయితే ఈ విషయంలో గోవర్ధన్ రెండో కృష్ణుడు మాత్రమే నని అసలు కృష్ణుడు వేరే ఉన్నాడని కేదారేశ్వరికి తెలిసినా ఆమె గోవర్ధన్ ను విడిపించటానికి ఎలాటి ప్రయత్నం చేయటం లేదు.

************** **************** **************

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.